# చికిత్స

ఆఫీసు పనిమీద అనంతపురం వెళ్ళవలసి వచ్చింది. రికార్డు రూము గాలించడం, ఏవో పాత కాగితాలను వెదికి తీసుకోవడం, అదంతా ఒకటి రెండు గంటల్లోనే ముగిసింది. ఆఫీసు పని పూర్తికాగానే నాకు జ్ఞప్తికి వచ్చినవాడు శంకరం. శంకరం మంగమ్మత్త కొడుకు. మంగమ్మత్త మా నాన్నగారి తోబుట్టువు గాదు, మేనమామ పెళ్లాం కాదు. మంగమ్మత్తకు ఆడబిడ్డలు లేరు. కనుక పిల్లనిచ్చిన అత్త అనుకోడానికి అవకాశాలే లేవు. మేము కాపురముంటున్న వీధిలోని ఆబాల గోపాలం ఆమెను మంగమ్మత్తగా వ్యవహరించడం పరిపాటి. ఆ మంగమ్మత్త కొక్కడే కొడుకు శంకరం.

శంకరాన్ని గురించి నాకు తెలిసిన వివరాలు చాలా తక్కువ. అతడెందాక చదువుకున్నాడో నాకు తెలియదు. నెలకొకటికి అతడి సంపాదన ఎంతో నాకు తెలియదు. ఎలక్ట్రిక్ డిపార్టుమెంటులో ఉద్యోగం చేస్తున్నాడని మాత్రం తెలుసు. కానీ, ఆ మనిషిలో విద్యుచ్ఛక్తి లాంటిదేదో చాలా తక్కువగా వున్నట్టు తోచేది. డస్సిపోయినట్లున్న శరీరం, వ్రేలాడవేసుకున్న ముఖం, అలసిపోయిన లక్షణాలను ప్రకటించే కళ్లు. ఆ కాళ్లూ చేతులు తోటకూర కాడలు. అతడు వీధి వెంట నడిచిపోతుంటే అది నడక అనుకోడానికి మనసొప్పదు. గాలి సముద్రంలో అదొకవిధమైన నాసిరకం ఈతలాగే కనిపించేది.

ఆ వీధిలో మేము కాపురం పెట్టిన మొదటి రోజుల్లో పరిచయం అయిన వ్యక్తి మంగమ్మత్త. "బాబూ! ఈ వూరికి కొత్తగా వచ్చారా మీరు? ఏ ఆఫీసులో నాయనా వుద్యోగం? ముచ్చటగా యిద్దరేనా బిడ్డలు మీకు? బాగుంది నాయనా బాగుంది. ఎంతలేదన్నా మీ కాపురానికి రోజు కొక పడి పాలు కావలసివస్తుందనుకుంటాను. మీరు వెదుక్కోనక్కరలేదు. నాకు వదలిపెట్టండి. మీ యింటికి పాలు పంపించే పూచీ నాది. పాలలో నీళ్లు కలిపే నామర్దా పని నా యింటా ఒంటా లేదు. కావలిస్తే అడిగి తెలుసుకోండి. నెలకొక్కసారి మీరెప్పుడిస్తే అప్పుడే తీసుకుంటాను డబ్బు? ఏం బాబూ, సరేనా? నాదేముంది, అంతా యింటావిడ యిష్టం అనవుగదా! అనవులే? అమ్మాయైనా నీ మాట

కెదురుచెప్పే బాబత్తుగా తోచడం లేదు. అదే నాయనా, అలా గుండాలి మరి? ఆలూ మొగుళ్లిద్దరిదీ ఒకటే మాటైతేనే సంసారాలు మిట్టకెక్కేది..."

పైన పేర్కొన్న విధంగా మా యిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా మా కుటుంబ జీవితంలోకి నిరాఘాటంగా చొచ్చుకుని వచ్చేసింది మంగమ్మత్త.

ఆవిడ యిచ్చే పాలల్లో నీళ్లున్నాయో లేవో ఆరా తీయడానికి మేము ప్రయత్నించ లేదు. ఈ నెల కింత డబ్బయింది అని ఆవిడ చెబితే, ఆ విషయంపైన పునరాలోచన చేయడానికి పూనుకోలేదు. ఆయా కారణాలవల్ల మంగమ్మత్తతో మాకేర్పడిన సాన్నిహిత్యం దినదినాభివృద్ధి చెందడంలో ఆశ్చర్యమూ లేదు. మంగమ్మత్త యించుమించుగా మా కుటుంబంలో ఒక అనధికార సభ్యురాలిగా పరిణమించిందని చెప్పినా చెప్పవచ్చు. కానీ, ఆ వీధిలో మేము కాపురం పెట్టిన అయిదారు మాసాల వరకూ నాకు శంకరంతో ముఖపరిచయమేగాని మాటల పరిచయం లేదు.

మంగమ్మత్త ఆరువందల రూపాయలు పెట్టి ఒక నెల్లూరావును కొన్న రోజులవి! ఆ ఆవు కొమ్ముల విన్నాణాన్ని గురించి, పొదుగు ఒయ్యారాన్ని గురించి, గంగడోలు హుందాతనాన్ని గురించి మా వీధిలో ముమ్మరంగా ప్రచారం కొనసాగింది. స్వయంగా పనిగట్టుకుని వెళ్ళి నెల్లూరావును చూచిరాకపోయిన వారిని మంగమ్మత్త తన ఆత్మీయుల జాబితా నుంచి తొలగించే ప్రమాదం కూడా ఏర్పడింది. ఒక రోజు సాయంకాలం ఆఫీసు నుంచి తిరిగొస్తూ వీధి గుమ్మంలో నిలబడి పలకరించాను. "బాబూ, వచ్చావా ? ఒరే శంకరం, శేఖరం బాబుగారొచ్చార్రా? తీసుకెళ్ళి గదిలో కూర్చోబెట్టు. కూచో నాయనా, ఆవు మేత కెళ్లిందింకా రాలేదు, వస్తుందిగానీ గదిలో కూచో, నిమిషంలో కాఫీ పెట్టి తీసుకొస్తాను". అని లోపలికెళ్లింది.

గది గుమ్మంలో నుంచి శంకరం ముఖం వెలుపలికి కనుపించింది. "నమస్కార మండీ! లోపలికి రండి!" అన్నాడు. గదిలోకి ప్రవేశించాను. ఆ గదిలో అడుగు పెట్టిన క్షణంలో నా శరీరమెందుకో గగుర్పాటుకు లోనైనట్లు తోచింది. ఇంపితంగాని వాసన ఏదో ముక్కుపుటాలను వొలచి వేస్తోంది. పెద్ద ఆసుపత్రిలో ఇన్ పేషంటు వార్డులో అడుగు పెట్టినప్పుడు గానీ, నా కిలాంటి అనుభూతి కలిగేది కాదు. ఆ గది కొక కిటికీ లేకపోలేదు గానీ, మంచిగాలి లోపలికి వచ్చే అపాయం లేకుండా కిటికీ తలుపులు బిగింపబడి వున్నాయి. గది నడుమ ఒక నవారు మంచం వుంది. సర్వకాల సర్వావస్థల్లోనూ పాంచభౌతిక శరీరాన్ని దానిపైన పడవేసి వుంచడానికి వీలుగా ఆ మంచంపైన వో పరుపు పరచబడి వుంది. మంచాని కవతల ఒక టేబిలు, దానిపైన మందుసీసాలు,

లేహ్యాల డబ్బాలు, మాత్రల ప్యాకెట్లు, ఇంజక్షన్లు, మందులు. ఒక క్షణంపాటు ఆ గదిలో నిలబడితే చాలు, రోగాల కక్కడ రాజపోషణ జరుగుతుందన్న విషయం యిట్టే అవగతమై పోతుంది.

తారు లాంటి చిక్కటి ద్రవాన్ని మంచి నీటితో కలుపుకుని త్రాగడానికి ఉద్యుక్తుడవుతున్న సుముహూర్తంలో నే నక్కడికి వెళ్ళినట్లున్నాను. నేను గదిలోకి వెళ్లేసరికి శంకరం మందును గుట గుట త్రాగేస్తున్నాడు.

"ఏదో అవుషథం పుచ్చుకుంటున్నారల్లే వుంది" అన్నాను.

"అవుషథం కాదండి, టానిక్కు" అన్నాడు శంకరం.

"బాబూ శేఖరం! అవి రాణిపేట డాక్టరు గారు చెప్పిన మందులు. వేలూరు అమెరికన్ డాక్టరుగా రిచ్చినవి అలమరాలో వున్నాయి. తెరచి చూపించరా శంకరం. అలాగే మొన్న తపాలా బంట్రోతు తెచ్చియిచ్చిపోయిన పొట్లాలు కూడా చూపించు. అదేదో సొర్నబస్మమటయ్యా శేఖరం! నల్లగా బొగ్గు పొడిలా వుంటుంది. బంగారాన్ని పుటం పెడితే అలా తయారవుతుందట. పొట్లంలో వుండేదల్లా గోరంత మందు. దాని వెల రెండు రూపాయలు...

మంత్రులు, సామంతులు, దండనాయకులు మొదలైన వాళ్లు యింటికి వచ్చిన అతిథులకు తమ ఏడువారాల సొమ్ములు చూపెట్టుకునే వారట. శంకరం అవుషథం సామగ్రిని చూపెడుతున్న తీరు అందుకు విభిన్నంగాలేదు.

"ఇంతకూ మీ జబ్బేమిటో చెప్పారు కారు" అన్నాను.

నా అవివేకానికి జాలిపడుతున్నట్లుగా ఒక నవ్వు నవ్వబోయి, అంతలో నవ్వడానికి తానేమీ అవుషథం పుచ్చుకోలేదన్న వూహ కలిగినట్లుగా ఆ నవ్వును నడమంతరంలోనే తుడిచిపెట్టేశాడు శంకరం. నింపాదిగా రోగ లక్షణాలు వివరింప సాగాడు. ఆకలి కాదు, తిన్న తిండి జీర్ణం కాదు, రాత్రిళ్లు నిద్రపట్టదు, ఏ మాత్రం చిన్న పని చేద్దామన్నా ఓపిక వుండదు. ఎల్లప్పుడూ మంచానికి బల్లిలా అంటిపెట్టుకుని ఉండాలనే అనిపిస్తుంది. రాణిపేట డాక్టరుగారు దీనికి యింగ్లీషులో ఏడక్షరాల పేరొకటి చెప్పాడు. వేలూరు డాక్టర్లు ఒకటీ రెండూ కాదు, సమిష్టిగా అయిదారు జబ్బులు తన శరీరంలో సహజీవనం చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తాను రెండు మాసాల సిక్ లీవులో వున్నాడు. అది యింకా వారం రోజుల్లో పూర్తవుతుంది. ఇంకా రెండు నెలలో, మూడు నెలలో ఈ సిక్ లీవు పొడిగించక తప్పేటట్టు లేదు.

కాఫీ గ్లాసుతో గదిలోపలికి వచ్చిన మంగమ్మత్త కుమారునివైపు చూస్తూ "నువ్వు పాలు పుచ్చుకుంటావత్రా శంకరం?" అంది.

"ఎందుకులేవే అమ్మా? టానిక్కు తీసుకుని అరగంటయింది. ఇప్పుడు రెండు మాత్రలు వేసుకుంటాను" అన్నాడు శంకరం, టేబుల్ పైనుంచి మాత్రల ప్యాకెట్ అందుకొంటూ?

ఇంట్లో నెల్లూరావుండి ఏం లాభం? గోక్షీరానికి బదులుగా రెండు మాత్రలు, గ్రుక్కెడు నీళ్లు. కానీ మందులు లభించినంత సులభంగా శంకరానికి సిక్ లీవు లభించలేదు. డిపార్టుమెంటుకే విసుగెత్తి ఒక నిర్ణయానికి వచ్చింది. వెళ్లి అనంతపురంలో ఉద్యోగం చేస్తే చేయవలసింది, లేకుంటే రాజీనామా యిచ్చి శుభ్రంగా యింటి దగ్గరే వుండిపోవలసింది...

గత్యంతరం లేక శంకరం రైలెక్కాడు. మంగమ్మత్త విలవిలలాడిపోయింది.

అనంతపురం వెళ్ళిన కొత్తలో కొంతకాలం పాటు అంతరిక్షం నుంచి వార్తలు పంపని రాకెట్టులా వుండిపోయాడు శంకరం. అతడి మొదటి ఉత్తరం కాస్త ఆలస్యంగానే అందింది.

"ప్రియమైన తల్లిగారికి నమస్కారం. నా ఆరోగ్య మేమీ బాగుండటం లేదు. నానాటికి తీసికట్టు నాగంభొట్టు అన్నట్లుగా వుంది పరిస్థితి. పెట్టడానికి యిక లీవులు మిగిలిలేవు. ఏం చేయాలో తోచడంలేదు. డాక్టరు పంపాపతిరావు గారిని చూద్దా మనుకుంటున్నాను. మొండి జబ్బుల్ని నయం చేయడంలో ఆయనకిక్కడ చాలా పేరుంది. ఏమిటో మరి, నా అదృష్ట మెలావుందో చూడాలి...."

మళ్లీ నెల రోజులకు రెండో ఉత్తరం.

".... పది పదిహేను రోజులుగా పంపాపతి రావుగారి దగ్గరకు వెళ్లొస్తున్నాను. పరీక్ష చేయడమేగాని యింతవరకూ ఈయన మందులిచ్చిన పాపాన పోలేదు. ఎందుకోగానీ నాకు చాలా భయంగా వుంది. జబ్బేమిటై వుంటుందని ప్రశ్నిస్తే ఈయన విరగబడి నవ్వేస్తున్నాడు. రక్త పరీక్ష, నాడి పరీక్ష, కళ్లు తెరవమనడం, నాలుక చాపమనడం, గుండె సవ్వడి గమనించడం, యిలా మరికొన్ని పరీక్షలు కూడా ముగించి, నాలుగైదు రోజుల్లో ఈ జబ్బేమిటో తేల్చి చెప్పగల నంటున్నాడు. ఆపైన కొత్త మందులు కొనుక్కోవలసి ఉంటుంది. ఎంత డబ్బు కావలసి వస్తుందో తెలియదు. నా దగ్గర డబ్బులేదు...."

మూడో ఉత్తరం కోసం ఊపిరి బిగబట్టుకోవలసి వచ్చింది.

కానీ, యిక్కడొక విచిత్రం జరిగింది. మూడో ఉత్తరమైతే వచ్చిందిగాని, అది శంకరం వ్రాసిందేనా అన్న అనుమానం ఒక పట్టాన మమ్మల్ని వదిలిపెట్టింది గాదు.

"తల్లి గారికి నమస్కారం. బహుశా ఈ జాబులోని విషయాలను నువ్వు నమ్మకపోవచ్చు. నేను మునుపటి మనిషిని గాను. నా కిప్పుడెంతో ఉత్సాహంగా ఉంది. అవలీలగా ఆఫీసు పని చేయగలుగుతున్నాను. హాయిగా నిద్రపోతున్నాను. గడచిన నెల రోజుల్లో పది పౌనులు పెరిగాను.

బరువు హెచ్చాను. ఇంకొక ఆరు మాసాలు గడిచిన తరువాత నేను మన వూరొస్తే నువ్వు నన్ను గుర్తుపట్టలేక పోవచ్చు. అంతా పంపాపతిరావుగారి దయ..."

ఆఫీసు పనిపైన అనంతపురం వెళ్ళవలసి వచ్చిందని చెప్పానుగదూ, అందుకొక రెండు మూడు రోజులు ముందుగా అందింది ఈ ఉత్తరం.

"బాబ్బాబూ! నువ్వు తప్పకుండా మా శంకరాన్ని చూచిరావాలి. జాబులో వాడు వ్రాసిందంతా అయోమయంగా వుంది. నేను దిగులు పడకుండా వుండటానికని అలా వ్రాశాడేమో! నువ్వు చూచివచ్చి మంచి కబురు కాస్తా చెవిలో పడవేస్తే నేను చచ్చి నీ కడుపున కూతురుగా పుడతాను" అంది మంగమ్మత్త.

మంగమ్మత్తలాంటి ప్రయోజకురాలు కూతురుగా పుట్టడం సామాన్యమా?

ఆఫీసు పని పూర్తికాగానే శంకరం కోసం బయల్దేరాను. అతడు ఆఫీసులోనే కనిపించాడు. కలుసుకున్న అయిదు నిముషాలకల్లా అతడి ఉత్తరంలో అతిశయోక్తి లేదన్న నిర్ణయానికి రాగలిగాను. అతడిప్పుడు గలగలా మాట్లాడేస్తున్నాడు. తల పైకెత్తి ఛాతీ ముందుకు విరిచి నిష్కంపంగా నిలువ గలుగుతున్నాడు. చకచకా నడుస్తున్నాడు. కొండ వాలున సెలయేరులా జల్లుజల్లున నవ్వేస్తున్నాడు.

"ఈ యింద్రజాలం ఎలా సాధింపబడిందో చెప్పవా శంకరం" అన్నాను.

"మరేం లేదు. పంపాపతిరావుగారి ప్రిస్క్రిప్షన్ అలాంటిది". అన్నాడు శంకరం. అంటూ జేబులో నుంచి ఓ చిన్న కాగితంపైకి తీశాడు.

డాక్టరు పంపాపతిరావుగారి దస్తూరీ నాకు బాగా అర్థమైంది.

"నీకు జబ్బేమీలేదు. ఆకలైనప్పుడు అన్నం తినాలి. లేహ్యాలు తినగూడదు. దాహం వేసినప్పుడు దండిగా నీళ్ళు త్రాగాలి. టానిక్కు త్రాగగూడదు. బడలికగా వున్నప్పుడు విశ్రాంతి తీసుకోవాలి. ఇంజక్షనులు తీసుకోగూడదు. ఆరోగ్యంగా వుండడం శరీరానికి సహజ గుణం. రోగం కృత్రిమ లక్షణం. మందులతో రోగాన్ని ఆరాధించవచ్చు. మనకు జబ్బులేదన్న నిర్ణయంతో ఆరోగ్యాన్ని ఉపాసించు."

(ఆంధ్రప్రభ - దినపత్రిక ఆదివారం - 14-12-1972)

❀ ❀ ❀